క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



వేమగిరితోటలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కడియం: మండలంలోని వేమగిరి తోటలో నెలకొన్న పారిశుధ్య పరిస్థితులను ఎంపీడీఓ జి.రాజ్‌మనోజ్ మంగళవారం పరిశీలించారు. డ్రైనేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా సెప్టిక్‌ట్యాంకర్ల సాయంతో తోడించేందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అలాగే అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి, శాశ్వతంగా ముంపు సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు రూపొందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



దుళ్లలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కడియం: ఆరోగ్యకర జీవనానికి పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని దుళ్ల, వీరవరం గ్రామాల్లో పంచాయతీ, రెవెన్యూ, సచివాలయ, వైద్యారోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పర్యావరణానికి ముప్పు తెచ్చే ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిరోధించాలన్నారు. స్వచ్ఛమైన ఆహార పదార్థాలే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చాకే తాగు నీటిని వినియోగించాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఆర్.వెంకటలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ వినీత, వి.ఐశ్వర్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కిలో రూ.55కు టమాటా విక్రయాలు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో రైతు బజార్లతో పాటు, ఐదు ముఖ్య కూడళ్లలో కిలో టమాటా రూ.55కు విక్రయిస్తున్నారు. మంగళవారం స్థానిక 45వ డివిజన్ ఆర్‌అండ్‌బీ కాలనీలో ఉన్న రైతు బజార్ ప్రత్యేక కౌంటర్‌లో వినియోగదారులకు టమాటాల విక్రయాలను రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ కంటే రూ.20 తగ్గించి కందిపప్పును, రూ.10 తగ్గించి బియ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. నగరంలోని మల్లయ్యపేట, ఏవీఏ రోడ్డు, ప్రకాష్ నగర్, స్టేడియం రోడ్డు, బొమ్మూరు ప్రాంతాల్లోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా టమాటాలను విక్రయిస్తున్నట్టు వివరించారు. జిల్లా ట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.సునీల్ వినయ్ మాట్లాడుతూ నగరంలో ఐదు ప్రాంతాల్లో, రాయల్ అపార్ట్‌మెంట్స్ వద్ద మొబైల్ రైతుబజార్ ద్వారా సుమారు 1,500 కిలోల టమాటాలు విక్రయించామన్నారు. వారం రోజుల పాటు విక్రయాలు కొనసాగుతాయన్నారు. మాజీ కార్పొరేటర్ కొయ్యల రమణ, కాశీనవీన్, రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

సంఘ కాపరి నేనే..

పాస్టర్ నరెళ్ల అనిల్‌కిరణ్

ధవళేశ్వరం: ధవళేశ్వరంలోని ఎస్‌ఎంఈఈ సంఘ కాపరిని తానేనని, ఏఈఎల్‌సీ మోడరేటర్ ఉత్తర్వుల మేరకు పాస్టర్‌గా ఐదేళ్ల పాటు పదవిలో కొనసాగుతానని ధవళేశ్వరం ఎస్‌ఎంఈఈ లూథరన్ చర్చి పాస్టర్ నరెళ్ల అనిల్ కిరణ్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక ఎస్‌ఎంఈఈ లూథరన్ చర్చిలో అసిస్టెంట్ పాస్టర్ సూర్యతేజ, ట్రెజరర్ జల్లూరి ప్రవీణ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అనిల్‌కిరణ్ మాట్లాడుతూ ఎస్‌ఎంఈఈ సంఘానికి అసిస్టెంట్ పాస్టర్‌గా జి.కిరణ్‌బాబును నియమించినట్టు నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించి, సంఘంలో అలజడులు సృష్టిస్తున్నారన్నారు. పాస్టర్ కిరణ్ బాబును సఖినేటిపల్లి చర్చి పాస్టర్‌గా ఏఈఎల్‌సీ నియమిస్తే, అక్కడకు వెళ్లకుండా ధవళేశ్వరం చర్చిలో వివాదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. దీనిపై ధవళేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇరు వర్గాలతో చర్చించి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. చర్చి ట్రెజరర్ జల్లూరి ప్రవీణ్ మాట్లాడుతూ 2022 జూన్ ఒకటిన తాను బాధ్యతలు చేపట్టానని, ఇప్పటికి రెండేళ్లు పూర్తయిందన్నారు. చర్చి నిధులు దుర్వినియోగమైనట్టు కొందరు ఆరోపిస్తున్నారని, తాను అవినీతికి పాల్పడినట్టు రుజువు చేస్తే అంతకు పది రెట్లు ఎక్కువగా ఇస్తానని స్పష్టం చేశారు. ఏఈఎల్‌సీ పదవిని వదులుకుంటానని సవాలు చేశారు. చర్చికి సంబంధించి ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాలేదని చెప్పారు. సంఘ సభ్యులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల గాలం

- అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్యానికి భద్రత
- వాతావరణ మార్పులతో విష జ్వరాలకు ఆస్కారం
- నియోజకవర్గంలో వివిధ శాఖల సమన్వయంతో నియంత్రణ చర్యలు

రోజురోజుకూ వర్షాలు పెరుగుతూనే ఉన్నాయి. వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఈ క్రమంలోనే వ్యాధుల సీజన్ ఆరంభమైంది. ఇప్పటికే వివిధ రకాల జ్వరాలతో బాధితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. దీంతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. తాగునీరు, పారిశుధ్య చర్యలపై దృష్టి పెట్టడంతో పాటు, ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తోంది.



ధవళేశ్వరం ఎర్రకొండపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: వాతావరణ మార్పులు, అడపాదడపా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. డ్రైనేజీలు, మురుగు నీటి నిల్వలతో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదముంది. ప్రస్తుతం ఆస్పత్రులకు వస్తున్న జ్వరాల కేసులు కూడా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల నియంత్రణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. వైద్యారోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విస్తృత అవగాహన

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో కడియం మండలంలో సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు, కడియపులంక పీహెచ్‌సీ ఉంది. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ధవళేశ్వరం, కాతేరు పీహెచ్‌సీలు, అర్బన్ పరిధిలో శంభూనగర్, వాంబే కాలనీ, ఇన్నీసుపేట యూపీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

ఇప్పటివరకు శాటిలైట్‌సిటీ గ్రామంలో ఓ డెంగీ కేసు నమోదైంది. వేరే ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చిన వ్యక్తికి డెంగీ సోకగా, అతను ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నాడు. పీహెచ్‌సీల వైద్యాధికారుల పర్యవేక్షణలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి విష జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

తాగునీరు కలుషితం కాకుండా..

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో పరిశుభ్రమైన మంచినీరు అందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో బొమ్మూరులో 40 ఎంఎల్‌డీ సురక్షిత మంచినీటి పథకంతో పాటు,



పిట్టలవాని చెరువు నుంచి శాటిలైట్ సిటీ వెళ్లే రోడ్డులో తాగి పడేసిన కొబ్బరి బొండాలు

రూరల్ మండలంలో పది పంచాయతీలకు 56 పెద్ద, 38 చిన్న రిజర్వాయర్లు, కడియం మండలంలో 11 పంచాయతీలకు 29 పెద్ద, మూడు చిన్న రిజర్వాయర్ల ద్వారా ప్రజలకు తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమన్వయంతో 15 రోజులకోసారి రిజర్వాయర్లను శుభ్రం చేసే చర్యలు చేపడుతున్నారు. నిత్యం 40 వేల లీటర్ల నీటిలో వంద గ్రాముల బ్లీచింగ్ కలిపి క్లోరినేషన్ చేస్తున్నారు. మంచినీటి పైపులైన్ల లీకేజీలను అరికట్టారు. ఈ నెల 13వ తేదీ వాటర్ ట్యాంకుల పరిశుభ్రతకు డ్రైడే నిర్వహించారు. ఇన్‌చార్జి జేసీ దినేష్‌కుమార్ రూరల్, కడియం మండలాలను స్వయంగా పర్యవేక్షించారు.

ముమ్మర పారిశుధ్య చర్యలు

డ్రైనేజీల్లో మురుగు నీరు నిల్వ లేకుండా పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య సిబ్బందితో చర్యలు చేపడుతున్నారు. ప్రధాన కాలువల్లో పూడికలను తొలగించి, వర్షపు, మురుగు నీరు సక్రమంగా పారేలా చర్యలు చేపట్టారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి విషజ్వరాలు దరిచేరవని వైద్యాధికారులు చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. రెండు రోజుల్లో జ్వరం తగ్గకపోతే స్థానిక ఆస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, యాంటీ బయోటిక్స్, సెలైన్ బాటిళ్లు, రక్త పరీక్షల సామగ్రి ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. సాధ్యమైనంత వరకు తాగు నీటిని కాచి చల్చార్చి తాగాలి. గ్రామాల్లోని ప్రజలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలి.

– డా.కె.సుధాకర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, ధవళేశ్వరం

విద్యుత్ ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాజమహేంద్రవరం సర్కిల్‌లో నూతనంగా ఏర్పడిన రాజమహేంద్రవరం రూరల్ డివిజన్ కార్యవర్గం సోమవారం రాత్రి ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంస్థ గౌరవాధ్యక్షుడు కాశీమోహన్‌రావు, స్టేట్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, సంస్థ కార్యదర్శి వెంకటేశ్వరరావు, స్టేట్ జనరల్ సెక్రటరీ అంబటి రాజారత్నం, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట చినవెంకట్రావు, టౌన్ డివిజన్ ప్రెసిడెంట్ ముప్పిడి గణేష్ ఈ ఎన్నికలను పర్యవేక్షించారు. సంఘ రూరల్ డివిజన్ గౌరవాధ్యక్షుడిగా తుమ్మల తాతారావు, ప్రెసిడెంట్‌గా ఎంసీహెచ్ అప్పలరాజు, సెక్రటరీగా పిల్లి వైవీ ప్రసాద్, ట్రెజరర్‌గా కుసుమ శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.మాధవరావు, పబ్లిసిటీ సెక్రటరీగా ఐ.దుర్గాప్రసాద్, అడిషనల్ సెక్రటరీగా నాగబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శ్రీనివాస్, అసిస్టెంట్ సెక్రటరీగా రత్నరాజు, వైస్ ప్రెసిడెంట్‌గా సత్యనారాయణ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలి

రాజమహేంద్రవరం రూరల్: కోలమూరు పంచాయతీలోని కోదండరాముని చెరువు ఆక్రమణకు గురైందని, సర్వే చేసి చెరువు ఆక్రమణలను తొలగించాలని పలువురు బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి విజయారెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ఆర్యాపురం బ్యాంక్ అభివృద్ధే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ యువజన నేత జక్కంపూడి గణేష్



బ్యాంకు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న జక్కంపూడి గణేష్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులోని ఖాతాదారులకు గతంలో కంటే మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నందెపు శ్రీనివాస్ ప్యానల్ పని చేస్తుందని వైఎస్సార్ సీపీ ఉమ్మడి గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మంగళవారం స్థానిక తుమ్మలావ, కోర్లమ్మపేట, ఆర్యాపురం తదితర ప్రాంతాల్లో బ్యాంక్ ఎన్నికల ప్రచారంలో చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్ ప్యానల్‌కు మద్దతుగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంక్‌కు ఘన చరిత్ర ఉందని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల బ్యాంకు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్ నాయకత్వంలో పోటీ చేస్తున్న డైరెక్టర్లందరికీ బ్యాంకుపై అన్ని విషయాల్లో పూర్తి అవగాహన ఉందన్నారు. ఈ ప్యానల్‌ను గెలిపిస్తే బ్యాంకు మరింత పురోగతి సాధిస్తుందన్నారు. ఆదర్శ బ్యాంకుగా తీర్చిదిద్దడానికి ఈ ప్యానల్ కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు నందెపు శ్రీనివాస్ ప్యానెల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బ్యాంకు ప్రతిష్టను ఇనుమడిస్తాం

చైర్మన్ అభ్యర్థి నందెపు శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకవర్గంలో బ్యాంకులో ఎన్నో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. రాజమహేంద్రవరానికి, బ్యాంకుకు మచ్చ తెచ్చేలా గత పాలకవర్గం పనిచేసిందన్నారు. అవినీతి విషయంలో రికవరీ చేయాలని ఆదేశాలున్నా, హైకోర్టు నుంచి స్టేలు తెచ్చుకున్నారని చెప్పారు. అటువంటి వ్యక్తులు మళ్లీ బ్యాంక్ ఎన్నికల్లో పోటీ చేయడం సిగ్గుచేటన్నారు. బ్యాంక్ బిల్డింగ్ నిర్మాణంలో, సివిల్ పనుల్లో, స్థల కొనుగోలులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. బ్యాంక్ ప్రతిష్ట ఇనుమడించేలా తమ ప్యానెల్ కృషి చేస్తుందని, బ్యాంకును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

ఉచిత కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న చింతా ప్రసాదరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను గుర్తించి, వారికి సదుపాయాలు అందించడంలో స్వర్ణాంధ్ర సేవా సంస్థ సేవలు అభినందనీయమని విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో ఉచిత కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఆయనతో పాటు, సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింతా ప్రసాద్‌రెడ్డి లబ్ధిదారులకు కళ్లజోళ్లను అందించారు. ఇటీవల మరణించిన చింతా నాగప్రణవరెడ్డి జ్ఞాపకార్థం రూ.10 వేలను ఉచిత కళ్లజోళ్ల కోసం ప్రసాదరెడ్డి సమకూర్చారు. సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ 26 ఏళ్లుగా తమ సంస్థ జిల్లాలో 1009 ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించినట్టు వివరించారు. ఈ నెల మూడున ఉచిత నేత్ర వైద్య శిబిరంలో గుర్తించిన 128 మందికి రూ.60 వేల విలువైన కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. 27 మందికి కంటి ఆపరేషన్లు చేయించి, నగదు సాయాన్ని సమకూర్చామన్నారు.

వ్యాధులపై పీఎంపీలకు అవగాహన



వైద్య నిపుణులను సత్కరిస్తున్న పీఎంపీలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రాథమికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, వైద్య సేవలందించే పీఎంపీలు వ్యాధులపై పూర్తి అవగాహన కలిగి ఉండటం ఎంతో మేలు చేస్తుందని ప్రముఖ గ్యాస్ట్రో వైద్య నిపుణుడు డాక్టర్ రామ్‌గోపాల్‌తేజ అన్నారు. మంగళవారం కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్(పీఎంపీ) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుకుంపేట గోదావరి రుచులు కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. సంఘ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ రామ్‌గోపాల్‌తేజ మాట్లాడుతూ జీర్ణాశయ వ్యాధులకు నేటి ఆహార అలవాట్లే కారణమన్నారు. జీర్ణ వ్యవస్థకు ఇబ్బంది కలిగించే క్యాన్సర్లు, కాలేయానికి వచ్చే కామెర్లు, వాటి ప్రాథమిక వైద్యం తదితర అంశాలను వివరించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ బీఎస్ మాణిక్యాంబ(బాల) మాట్లాడుతూ గర్భకోశ వ్యాధులు, గర్భాశయ క్యాన్సర్లను వివరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బళ్లా శ్రీనివాసరావు, పి.చిన్ని, మట్టా రమేష్, యు.ప్రసాద్‌బాబు, ఎ.సురేష్‌బాబు, సుంకర శ్రీనివాస్, ఎం.బాబ్జీ, కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైద్య నిపుణులను ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి అక్కమ్మతల్లి జాతర

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలో ఉన్న గురజాల అక్కమ్మతల్లి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 21 వరకు జరగనున్నాయి. ఈ మేరకు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం ఇక్కడ వివరాలు వెల్లడించారు. బుధవారం ఉదయం పంచామృతాభిషేకాలు, సాయంత్రం 108 ఘటాలతో ఊరేగింపు జరుగుతుందన్నారు. ఈ నెల 18న సహస్ర కమల పూజలు, 19న కుంకుమ పూజలు, 20న లక్ష పసుపు కొమ్ములతో లక్ష్మీ పూజ, 21న ఉదయం 5 నుంచి అమ్మవారి దర్శనం, మధ్యాహ్నం 3.49 గంటలకు అమ్మవారికి ఊరేగింపు ఉంటుందని వివరించారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అవుట్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఐదు బళ్ల మార్కెట్ ప్రాంతానికి చెందిన వీరగంట భీష్మ(65) భార్య చనిపోయింది. ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ, వారి వద్ద ఉండకుండా మద్యం తాగుతూ తిరుగుతుంటాడు. మంగళవారం రాత్రి 7.30 సమయంలో వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొనడంతో, తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి తమ్ముడు వీరగంట మురళి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సంఘ నూతన కార్యవర్గమిదే..

కంబాలచెరువు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నగర శాఖ నూతన కార్యవర్గం స్థానిక డీఎంహెచ్ స్కూల్‌లో మంగళవారం ఎన్నికైంది. సంఘ జిల్లా అధ్యక్షుడు డేనియల్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి అర్జునుడు తదితరుల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా కార్యదర్శిగా సేతు వేణుమాధవ్, నగర అధ్యక్షుడిగా ఎ.విశ్వేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.సీతారామయ్య ఎన్నికయ్యారు. అలాగే నగర ప్రధాన కార్యదర్శిగా దాసరి శివసత్యమూర్తి, సహాధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శిగా ఎస్.సుబ్రహ్మణ్యం, అదనపు కార్యదర్శులుగా ఎస్ఎస్ఎన్ ప్రసాద్, ఎస్.రవికుమార్, కార్యదర్శులుగా కేఎల్ఎస్ శాస్త్రి, ఎస్.సుబ్రహ్మణ్యం, పి.బాపిరాజు, కె.ఈశ్వర్‌రెడ్డిని ఎన్నుకున్నారు. పలువురు సంఘ ప్రతినిధులు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు కార్యాచరణ

- కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు కార్యాచరణ అమలు చేయాలని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. నగరంలో సీజనల్ వ్యాధుల నియంత్రణతో పాటు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరాన్ని ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పారిశుధ్య సిబ్బంది ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి అందరినీ వైద్య పరీక్షలు చేయాలని, నిర్లక్ష్యం తగదన్నారు. అవసరమైతే తక్షణ వైద్యసాయాన్ని అందించాలన్నారు. వర్షపు నీరు నిలువకుండా, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పూడికల తొలగింపు, బ్లీచింగ్, దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఓ ప్లాంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, గుర్తింపు లేని ఆర్ఓ ప్లాంట్ల నిర్వహణ చట్టరీత్యా నేరమన్నారు. యజమానులు ఖాళీ స్థలాలను మెరక చేసి, నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నల్లా చానల్ వద్ద పాముల సంచారం ఎక్కువగా ఉంటుందని, అక్కడ వ్యాక్సిన్లు అందుబాటులో ఉండేలా ఆరోగ్య విభాగం వారు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ కె.దినేష్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. చెత్త వేసే పాయింట్లు తగ్గించేలా ఇంటింటి చెత్త సేకరణ ముమ్మరం చేశామన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సత్యవేణి, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ వినూత్న, ఎస్ఈ పాండురంగారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాల చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటిలో సూట్‌కేసులో దాచిన 80 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని బొమ్మూరు నేతాజీనగర్‌కు చెందిన పెద్ది స్వాతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం, బొమ్మూరు నేతాజీనగర్ 9వ లైన్‌లోని ఓ ఇంట్లో పెద్ది స్వాతి రెండేళ్ల నుంచి అద్దెకు ఉంటున్నారు. ఆమె భర్త మాధవరావు రైల్వే గార్డుగా పనిచేస్తున్నారు. బీరువా తాళం పని చేయకపోవడంతో ఆమె తన 80 గ్రాముల బంగారు ఆభరణాలను బాక్సులో ఉంచి, సూట్‌కేసులో పెట్టింది. మాస్టర్ బెడ్రూంలోని అటకపై గత నెల 13న సూట్‌కేసు పెట్టింది. ఈ నెల 8న ఉదయం సూట్‌కేసు తెరిచి ఉండడాన్ని ఆమె గమనించింది. అందులో పెట్టిన బంగారు ఆభరణాల బాక్సు కనిపించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఎస్సై బి.శ్రీను కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌కేవీటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కంబాలచెరువు: రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ఎస్‌కేవీటీ పాఠశాల విద్యార్థిని పి.దానేశ్వరి గోల్డ్ మెడల్, నగదు బహుమతి సాధించిందని హెచ్‌ఎం ఎంవీఎం సుబ్రహ్మణ్యం తెలిపారు. తరగతి స్థాయిలో సైన్స్‌లో జి.నిహారిక సాయి, గణితంలో వి.సుభాషిణి, ఎక్సలెంట్ అవార్డును సుబ్రహ్మణ్యం అందుకున్నారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన సీనియర్ సైన్స్ టీచర్ బీబీ విజయకుమారిని సత్కరించారు. విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె.అప్పారావు, ప్రణీల, పూర్ణిమ, ఆదిలక్ష్మి, వరహాగిరి కృష్ణమోహన్, పీఈటీ మూర్తి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.